


# కరపత్రం

SINCE 2014

శనివారం నవంబర్ 29 2025 సంపుటి : 2 సంచిక : 55 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## పంచాయితీ ఎన్నికలపై సిఎం ఫోకస్

## 1నుంచి రేవంత్ జిల్లాల పర్యటన

హైదరాబాద్,నవంబర్28 :
పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సిఎం మరోమారు జిల్లాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థలను గెలిపించేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇలావుంటి. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటించనున్నారు.

తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.


2లో..

## బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- 42శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం
- కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కిన అధికార పార్టీ
- బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శ

హనుమకొండ,నవంబర్28 :
బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు కత్తులు నూరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పూర్తి వ్యతిరేకత ఉందని.. ఇక, భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచే అవకాశమే లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.




### ఉడుపితో అనుబంధం

## విడదీయరానిది

### లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ

బెంగళూరు,నవంబర్28 :
ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. జగద్గురు శ్రీ శ్రీ సుగుణెళింద్ర తీర్థ స్వామీజీ విశ్వగీత పర్యాయ.. ప్రధాని మోడీని సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఉడుపి జనసంఘ్, భారతీయ జనతా పార్టీకి సుపరిపాలన నమునాకు కర్మభూమిగా పేర్కొన్నారు. 1968లో ఉడుపి ప్రజలు జనసంఘ్ నుంచి వీఎస్.ఆచార్యను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఉడుపిలో కొత్త పాలనకు ప్రజలు పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, సన్యాసులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులతో భగవత్ గీతను ఏకగ్రీవంగా పారాయణం చేయించారు. ఇక ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలు దగ్గర నుంచి చిత్రాలను సేకరించాలని భద్రతా సిబ్బందిని, పోలీసు సిబ్బందిని మోడీ కోరారు.



## పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లీయర్

- ఈ దశలో స్టే విధించలేమని స్పష్టీకరణ
- తామే ఎన్నికలు నిర్వహించాలని..స్టే ఎలా విదిస్తాం
- పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

హైదరాబాద్,నవంబర్28 :
పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్‌ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలపగా..

మిగతాద్ది 2 లో


2లో..

## కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

- ఉనికి కోసం దీక్షాదివస్ పేరుతో డ్రామాలు
- సోనియా దయవల్లనే తెలంగాణ సాకారం
- ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేనివి
- బిసి రిజర్వేషన్ల అంశం ముగియలేదు
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్,నవంబర్ 28 :
తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.


2లో

## జనవరి 1న ఆయుధాలు విడిచి లొంగిపోతాం: మావోయిస్టులు

భద్రాచలం:
మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఎంఎంసీ(మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు.



2లో..

## కోకాపేట భూముల సరికొత్త రికార్డు

హైదరాబాద్:
కోకాపేటలో రియల్ సంస్థలు కోట్లు కుమ్మరిస్తున్నాయి. హెచ్‌ఎండీ భూముల వేలంలో తాజాగా మరో రికార్డు నమోదైంది.

### కామారెడ్డిలో

## కవిత రైల్వే రోకో

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- కాళేశ్వరంతోనిజామాబాద్‌కు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్య
- నిజాం సాగర్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి
- జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్

కామారెడ్డి,నవంబర్28 :
కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది.


2 లో

### అధికారాలను హరించేదిగా

## కేంద్ర విత్తన బిల్లు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్,నవంబర్ 28 :
రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేందప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది.


02

## యంగ్ ఇండియా స్కూల్స్ కాదు..

- పురుగలన్నం లేకుండా కాపాడండి
- ఎక్స్ వేదికగా హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్,నవంబర్ 28 :
మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా నాణ్యమైన ఆహారం అందించలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.


మిగతాది 2లో

కరపత్రం తెలుగు దిన పత్రిక
శనివారం నవంబర్ 29 2025

# పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లీయర్

మొదటి పేజీ తరువాయి

ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

# కామారెడ్డిలో కవిత రైల్వే రోకో

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను
అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# జనవరి 1న ఆయుధాలు విడిచి లొంగిపోతాం: మావోయిస్టులు

మొదటి పేజీ తరువాయి

మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.

# కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

# కోకాపేట భూముల సరికొత్త రికార్డు

మొదటి పేజీ తరువాయి

ఎకరం ధర అత్యధికంగా రూ.151 కోట్లు పలికింది.
గోల్డెన్ మైల్‌లోని ప్లాట్‌నెంబర్ 15, 16లో భూములకు శుక్రవారం వేలం జరిగింది. అయితే.. ప్లాట్ నెంబర్ 15లో ఎకరానికి రూ.151.25 కోట్ల ధర పలికింది. జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా ఈ ధరకు భూముల్ని దక్కించుకుంది. ఈ ప్లాట్‌లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలను హెచ్ఎండీ పొందింది.ఇక ప్లాట్ నెంబర్ 16లో ఎకరం ధర రూ.147.75 కోట్లు పలికింది. కోకాపేట నియోపోలిస్‌లో హెచ్ఎండీఏ తన భూముల్ని వేలం వేస్తున్న సంగతి తెలిసిందే. డిసెంబర్ 3న మిగతా ప్లాట్లకు వేలంతో ఇది పూర్తి కానుంది.

# అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# యంగ్ ఇండియా స్కూల్స్ కాదు..

మొదటి పేజీ తరువాయి

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం అందించిన ఘటనను గుర్తుచేస్తూ, ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నిసార్లు సమీక్షలు జరిపారో, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న వారిపై ఇప్పటిదాకా ఎన్ని చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని అన్న మాటలు ఎక్కడికి పోయాయి? మీ మాటలకు విలువ లేదు, ఆచరణలో దిక్కులేదని హరీష్ రావు విమర్శించారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులే రోడ్ల మీదకు వచ్చి 'పురుగులన్నం మాకు వద్దు' అని నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలతోనే నిండిపోయిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని హరీష్ రావు ఆరోపించారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

మొదటి పేజీ తరువాయి

గ్రామాల్లో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే భాజపాతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సరిగా చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సర్వర్లు పని చేయక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను
కాంగ్రెస్ తుంగలో తొక్కింది. బీసీ రిజర్వేషన్లపై డ్రామాలాడింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఈటల తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులకు గుర్తులు ఉండవని.. గెలిచిన వారిని కాంగ్రెస్ నుంచి గెలిచారని చెప్పుకుందామని భావిస్తున్నారేమో అంటూ సందేహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ చేసిన మోసానికి బీసీలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని...హామీ ఇచ్చేటప్పుడు తెలియదా? అంటూ అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. బీసీల జనాభా ఎంతో తేల్చకుండా రిజర్వేషన్లు ఎలా చేస్తారంటూ కాంగ్రెస్ సర్కారును ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాల కు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ ఎంపీ ఈటల హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే అధిక భూములు లాక్కుంటున్నారంటూ సోదాహరణగా వివరించారు. భూముల కోసమే జీహెచ్ఎంసీ పరిధి విస్తరించినట్లు అయితే.. దాని కంటే దరిద్రం ఇంకోటి లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# రాజధాని కోసం మరో 16వేల ఎకరాలు

చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ చేపట్టాలని రాష్ట్ర కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినేట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ అవసరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ దశలో మరో16 వేల ఎకరాల సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్రక్రియపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. మొదటి దశలో ప్రభుత్వ భూమి16 వేల ఎకరాలు సీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది. రాజధాని అమరావతి కోసం మొత్తం 50 వేల ఎకరాలు రైతుల నుంచి భూ సమీకరణ చేపట్టాలని ప్రభుత్వం భావించింది. మొదటి దశలో రైతుల నుంచి 34 వేల ఎకరాల సమీకరణ.. రెండో దశలో మరో 16 వేల ఎకరాలపై కసరత్తు చేస్తోంది. త్వరలో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను సీఆర్డీఏ విడుదల చేయనుంది. మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల వద్ద నుంచి తీసుకున్న భూమితో కలిపి 74 వేల ఎకరాలలో రాజధాని నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. రెండో విడత భూ సమీకరణకు సంబంధించి 7 గ్రామాల్లో భూ సేకరణ చేయనుంది. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, వడ్డమానులో 1,913 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాల భూ సమీకరణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20, 494 ఎకరాల భూ సేకరణ ద్వారా సీఆర్డీఏ తీసుకోనుంది. రాజధాని విస్తరణలో భాగంగానే మలిదశ భూ సమీకరణ
చేపడుతున్నామని మంత్రి నారాయణ తెలిపారు. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే స్టేషన్, స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం, స్మార్ట్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్‌కు 16,666 ఎకరాలు సమీకరిస్తున్నట్టు చెప్పారు. ఒలింపిక్స్ నిర్వహించే స్థాయిలో అంతర్జాతీయ క్రీడానగరం నిర్మిస్తామని తెలిపారు. రైతుల అంగీకారంతోనే భూ సమీకరణ చేస్తామని స్పష్టం చేశారు. 5వేల ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించనున్నట్టు వివరించారు. గతంలో ఇచ్చిన ప్రయోజనాలనే రైతులకు అందిస్తామని అన్నారు. కొండప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూమి కూడా తీసుకుంటామన్నారు. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామన్నారు. అమరావతి రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్టు నారాయణ తెలిపారు.

# డిప్యూటి సిఎం రాజోలు పర్యటనలో అపరిచత వ్యక్తి

**– అపరిచిత వ్యక్తి వైకాపా నేతగా గుర్తింపు**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో ఒక అపరిచిత వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్‌కు చేరువలో సంచరించినట్లు తెలుస్తోంది. ఆ రోజు శంకరగుప్తం డ్రయిన్ మూలంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలు పరిశీలిస్తున్న సమయంలో, అధికారులతో సంభాషిస్తున్న సందర్భంలో, ఆ తర్వాత కార్యక్రమంలో సదరు వ్యక్తి పవన్ కల్యాణ్‌కు సమీపంలో సంచరించారు. అతడు రాజోలు నియోజకవర్గం లోని వైకాపా కార్యకర్త అని డిప్యూటీ సీఎం కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో అధికారులు అతని వ్యవహార శైలి, కదలికపై అనుమానం వ్యక్తం చేస్తూ.. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అతడి కదలికలు, కార్యక్రమానికి జారీ చేసిన పాస్ అతడికి చేరడంపై సందేహాలను ఎస్పీకి వివరించారు. వెంటనే విచారణ చేపట్టి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# గోవాలో 77 అడుగుల శ్రీరాముడి కంచు విగ్రహం

**– ప్రధాని మోడీ చేతుల మీదుగా ఆవిష్కరణ**

దక్షిణ గోవా కనకోన పట్టణంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్టగాలి జీవోత్తం మఠం లో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఎత్తైన శ్రీరాముని కంచు విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. సాధువులు, సంతులతో తనకున్న ఆధాత్మిత అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమ సంస్కృతితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. మఠం 550వ వార్షికోత్సవంపై ఆర్గనైజేషన్ కమిటీ జాయింట్ కన్వీనర్ ఎస్ ముకుంద్ కామత్ మాట్లాడుతూ, 15,000 మంది ఈ ఈవెంట్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. శంకర్ మహదేవన్, అనూప్ జలోటా తదితర ప్రముఖ కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్టగాలి జీవోత్తం మఠం తొలి సారస్వత బ్రాహ్మిణ్ వైష్ణవ మఠమని పీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ గోవాలోని పార్టగాలిలో మఠం ప్రధాన కార్యాలయం ఉంది. 13వ శతాబ్దంలో జగద్గురు మధ్వాచార్యులు స్థాపించిన ద్వైత సిద్ధాంతాన్ని ఈ మఠం అనుసరిస్తుందని పేర్కొంది.

# కెసిఆర్ దీక్ష చేసినప్పుడు మీరంతా ఏమయ్యారు

## – విమర్శకులకు మాజీమంత్రి తలసాని విసుర్లు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మీద అవాకులు చవాకులు పేలినంత మాత్రాన ఆయన చరిత్ర మారదని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టం చేశారు. 2009 నవంబర్ 29వ తేదీన నాటి టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక చరిత్ర అని ఆయన అభివర్ణించారు. ఈ దీక్షపై పలువురు సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కొత్త బిచ్చగాళ్లు పొద్దు ఎరగరు అన్నట్లుగా కొంత మంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు.
ప్రత్యేక రాష్ట్రం రాకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎక్కడిది?.. తెలంగాణ ప్రభుత్వం ఎక్కడి దంటూ ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలను తలసాని శ్రీనివాసయాదవ్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బతుకమ్మ పేరుతో ఆనాడు తమ ప్రభుత్వం చీరలు పంచితే.. ప్రస్తుతం ఇందిరమ్మ చీరలంటూ పేరు మార్చారని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ చీరలు పంపిణీకి కేసీఆర్ తన పేరు పెట్టుకోలేదని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ దీక్షా దివాస్‌ను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి తలసారి స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్ర తెలియని వాళ్ళు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళు.. తెలంగాణ ఏర్పాటు చేసే సమయంలో ఎక్కడున్నారంటూ? ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించకుంటే.. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళకి పదవి ఎక్కడిదని కాంగ్రెస్ పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చారని నిండు అసెంబ్లీలోనే కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్ళ లాగా మూర్ఖుల్లా తాము మాట్లాడమని తలసాని శ్రీనివాసయాదవ్ స్పష్టం చేశారు.

# వేగంగా కదులుతున్న దిత్వా తుఫాన్

**– తమిళనాడులో భారీ వర్షాలు కురిసే ఛాన్స్**

ప్రస్తుతం శ్రీలంక తీరప్రాంతం, దాన్ని ఆనుకని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'దిత్వా తుఫాను' వేగంగా కదులుతోంది. ఈ వారాంతంలో ఉత్తర తమిళనాడువైపుకి కదులుతోందని, దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రామనాథపురం, తంజావూరు సహా ఐదు దక్షిన తీరప్రాంత, డెల్టా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుఫాను మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఆర్ఎంసి శుక్రవారం డెల్టా, దాని పరిసర జిల్లాలైన అరియలూర్, కడలూర్‌లకు ఆరెంజ్ అలర్ట్, ఎల్లో అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది.దిత్వా తుఫాను తమిళనాడు మరియు ఆంధ్రప్రదేశ్‌కు దగ్గరగా కదులుతుందని , నవంబర్ 29,30 మరియు డిసెంబర్ 1 తేదీల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్‌లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. తమిళనాడు విపత్తు ప్రతిస్పందన దళం (టిడిఆర్ఎఫ్) చెందిన 30మంది సిబ్బంది శుక్రవారం తంజావూరుకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మరో 30మంది టిఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది తిరువారూర్ చేరుకున్నారని అన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని తంజావూరు కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు కూడా ఒడ్డుకు తిరిగి వచ్చారని తెలిపారు.

# దిత్వా తుఫాన్‌తో అప్రమత్తం

'దిత్వా' తుపాను నేపథ్యంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావం ఎక్కువగా చూపే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు. శని, ఆదివారాల్లో వచ్చే భారీవర్షాలతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని సూచించారు. ప్రమాదకరమైన హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని తెలిపారు. జిల్లాలు, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో 'దిత్వా' తుపాన్ ఏర్పడింది. ప్రస్తుతానికి ఇది ట్రింకోమలీకి 80 కి.మీ, పుదుచ్చేరికి 480 కి.మీ, చెన్నైకి 580 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటల్లో 8 కి.మీ వేగంతో తుపాన్ కదిలింది. ఆదివారానికి నైరుతి బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. దిత్వా తుపాన్ ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురవనున్నాయి. దిత్వా తుపాన్ ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవనున్నాయి. శని, ఆది, సోమవారాల్లో కోస్తా,రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. శనివారం నాడు నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు.. శ్రీసత్యసాయి, అనంతపురం, కడప, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు భారీ వర్ష సూచన ఉంది. ఆదివారం, సోమవారాల్లో కూడా కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
ఈ రోజు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన గాజంగి నందయ్య గారు మొదటిసారి కోరుట్ల నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు గారు కోరుట్లలో ఏర్పాటుచేసిన సన్మాన వేదికపై మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి, ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మరియు కాంగ్రెస్ నాయకులు.

# జ్యోతిరావు పూలే వర్ధంతి - బిజెపి నాయకుల నివాళులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ పట్టణ చెక్‌పోస్ట్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళా విద్యాభివృద్ధి, సమాజంలో సమాన హక్కుల సాధన కోసం పూలే చేసిన పోరాటం యుగయుగాల పాటు గుర్తుండిపోతుందని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం సమాజ అభివృద్ధికి చాలా అవసరమని పేర్కొన్నారు. విద్య లేనిదే సమాజ ప్రగతి అసంభవమని, కుల వివక్షత, మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం పూలే ప్రారంభించిన ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రేరణగా మారిందని ఆమె అన్నారు.

# మేడ్చల్ లో పూలే వర్ధంతి - బీజేపీ నాయకుల నివాళులు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం మేడ్చల్ చెక్ పోస్ట్ కూడలిలో ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే సేవలను, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్య, శూద్రాతిశూద్రుల హక్కుల కోసం ఆయన చేసిన ఉద్యమం సమాజ అభివృద్ధికి బలమైన పునాది వేసిందని నాయకులు కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడవడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, బీజేపీ మేడ్చల్ ఉపాధ్యక్షులు ఎల్లంపేట్ గౌరారం జగన్ గౌడ్, బీజేపీ ఎల్లంపేట్ మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, కంచు గంట మహేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఓ కేంద్రాలు, ఎస్‌ఎస్టీ చెక్ పోస్ట్ తనిఖీ చేసిన ఎన్నికల సాధారణ పరిశీలకులు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలు ఆర్‌ఓ కేంద్రాలు, ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను జిల్లా సాధారణ పరిశీలకులు రవి కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి, వట్టెముల, ఆర్‌ఓ కేంద్రాలు, ఫాజుల్ నగర్ ఎస్‌ఎస్ టీ, రుద్రంగి ఆర్‌ఓ, ఎస్‌ఎస్ టీ చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు. ఆయా ఆర్‌ఓ కేంద్రాల్లో నామినేషన్లు, హెల్ప్ డెస్క్ ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ల్లో రికార్డ్స్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు భారతి, ఎంపీడీఓ లు నటరాజ్, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# కేటీఆర్ చిత్రపటానికి ఆటో కార్మికుల పాలాభిషేకం

**కరపత్రం ప్రతినిధివేములవాడ**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నటువంటి ఆటో కార్మికులకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్ 5 లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు ప్రకటించడంపై వేములవాడ ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తిప్పాపూర్ బస్టాండ్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహం ముందు ఆటో యూనియన్ నాయకులు సయ్యద్ ఉమర్ ఆధ్వర్యంలో కార్మికులు కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు వల్ల ఇప్పటివరకు 200 మంది ఆటో డ్రైవర్లు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ మేనిఫెస్టోలో ప్రతినెల 1000 రూపాయలు చొప్పున ఆటో డ్రైవర్లకు జీవన భృతి ఇస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్ కి 24 వేల రూపాయలు రేవంత్ సర్కార్ బాకీ ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, జోగిని శంకర్, అంజద్ పాషా,మహ్మద్ రఫీ,ఎండి వకీల్, మేడిపల్లి రాజు, బోజ్జ సుకుమార్, ఎంఏ జావీద్, మిఠాయి శంకరయ్య, బోడిగే దుర్గయ్య, పెంట రాజేష్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచార ఖర్చులు పకడ్బందీగా నమోదు చేయాలి

**- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**





**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు చేసే ఖర్చును పకడ్బందీగా నమోదు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారంలో భాగంగా చేసే వ్యయం వివరాల నమోదు పై శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సహాయ వ్యయ పరిశీలకులకు (ఏ. ఈ. ఓ)లకు శిక్షణ ఇవ్వగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్, నోడల్ అధికారి శేషాద్రి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్టర్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సర్పంచ్, వార్డు సభ్యులు ఈ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 2,50,000 అని, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి వ్యయ పరిమితి రూ.1,50,000 అని వెల్లడించారు. అలాగే 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 50,000 అని, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీ వార్డు అభ్యర్థి వ్యయ పరిమితి రూ.30,000 అని తెలిపారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్ళవద్దని వెల్లడించారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిక్షణలో డీపీఓ షరీఫుద్దిన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బీసీల కళ్లలో మట్టి కొట్టింది

**- డ్రామాలు ఆడి మొండిచేయి - బీసీ వర్గాల్లో ఆగ్రహం**
**- హుజురాబాద్‌లో మా అభ్యర్థులన్నీ గెలుస్తారు**





**కరపత్రం ప్రతినిధి కమలాపూర్, నవంబర్ 28.**
కమలాపూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో గ్రామపంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, స్థానిక నాయకులతో సమావేశమైన హుజురాబాద్ ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం, బీసీ రిజర్వేషన్లలో అన్యాయం, గ్రామపంచాయితీల పట్ల ప్రభుత్వ వైఖరిపై ఆయన మీడియాతో మాట్లాడారు.

**ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ**

"కాంగ్రెస్ పార్టీ బీసీల కళ్లలో మట్టి కొట్టింది. రెండేళ్లుగా డ్రామాలు ఆడి మొండిచేయి చూపించింది."
"కామారెడ్డి డిక్లరేషన్‌లో 42% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి చివరకు కొన్ని జిల్లాల్లో 17%, మరికొన్ని జిల్లాల్లో 21% మాత్రమే ఇచ్చారు."
"సర్వర్లు పని చేయడం లేదని కావాల్సిన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఎన్నికల ప్రక్రియను క్లిష్టతరం చేస్తున్నారు."
"రెండేళ్ల నిరీక్షణ తర్వాత బీసీ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి బొంద పెట్టడానికి సిద్ధమవుతున్నాయి."

గ్రామాల్లో సర్పంచులకు బిల్లులు ఇవ్వకపోవడం, వచ్చిన నిధులను ఖర్చు చేయకపోవడం, పలువురు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రావడం తీవ్ర వైఫల్యమని ఈటల విమర్శించారు. "రేపే నామినేషన్ చివరి రోజు... చాలా ఊర్లలో బతిలాడి నామినేషన్లు వేయించాల్సి వస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**హుజురాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయం : ఈటల**
"హుజురాబాద్‌లో 107 గ్రామపంచాయితీలు ఉన్నాయి. 25 ఏళ్లుగా అన్ని స్థానిక ఎన్నికల్లో మేమే గెలుపొందుతున్నాం."
"వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ గెలవకుండా ఏమ్మెల్యే గెలవడం అసాధ్యం. ప్రజలతో నేరుగా సంబంధం గ్రామాల్లోనే ఉంటుంది."
"ఈసారి కూడా మా అభ్యర్థులందరినీ గెలిపించుకోవడం ఖాయం."

రేపు నామినేషన్ల చివరి రోజు కావడంతో, విత్‌డ్రా తర్వాత గ్రామాల్లో ప్రజలకు స్వయంగా అప్పీల్ చేస్తానని ఆయన తెలిపారు. "నా గెలుపులో కీలకపాత్ర పోషించిన వారిని గెలిపించడం నా బాధ్యత" అని పేర్కొన్నారు.కేంద్ర నిధుల ద్వారానే గ్రామాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడిన ఈటలు
"కాంగ్రెస్, బి ఆర్ ఎస్ రెండూ రెండే."
"గ్రామపంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు లేవు%% కేంద్రం నిధులే దిక్కు."
"గ్రామంలో బల్బులు వెలిగాలన్నా, సిమెంట్ రోడ్లు, మోరీలు, అంగన్వాడీ బిల్లులు, జీతాలుఅన్నీ కేంద్ర నిధుల వల్లే సాధ్యం."
అందుకే గ్రామాభివృద్ధికి బీజేపీకి ఓటు వేయాలని హుజురాబాద్ ప్రజలకు ఇవేంటని విజ్ఞప్తి చేశారు.
ఈటల రాజేందర్

# కుటుంబ నియంత్రణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి - డాక్టర్ చందు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 28**
తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నవంబర్ 21 నుంచి డిసెంబర్ 4 వరకు నాన్‌స్కాల్పెల్ వేసెక్టమీ (ఎన్ ఎస్ వి) పక్షోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కుటుంబ నియంత్రణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జమ్మికుంటలో నిర్వహిస్తున్న ఎన్ ఎస్ వి శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు హుజురాబాద్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోత, కుట్టులు అవసరం లేని నాన్‌స్కాల్పెల్ వేసెక్టమీ ( ఎన్ ఎస్ వి) అత్యంత సురక్షితమైన శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతి అని తెలిపారు. ఆపరేషన్‌కు వచ్చిన వారికి విధానం గురించి అవగాహన కల్పించడంతో పాటు ఆపరేషన్ అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతుల ప్రచారంలో పురుషులు ముందుండాలని పిలుపునిచ్చారు.
అర్హులైన పురుషులు నవంబర్ 29, డిసెంబర్ 1 తేదీలలో జమ్మికుంట ప్రభుత్వ సివిల్ హాస్పిటల్‌లో, డిసెంబర్ 2 మరియు 4 తేదీలలో హుజురాబాద్ ఏరియా హాస్పిటల్‌లో ఎన్ ఎస్ వి ఆపరేషన్ చేసుకోవచ్చని డాక్టర్ చందు వెల్లడించారు. ఈ శిబిరాలను అర్హులైన వారు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్వైజర్ సదానందం, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కౌడిపల్లి మండల కేంద్ర కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా చంద్రం కృష్ణ గౌడ్

**- గెలిస్తే కౌడిపల్లి గ్రామ పంచాయతీ రూపురేఖలని మార్చేస్తా...!!!!**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట నవంబర్ 28**
మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన చంద్రం కృష్ణ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉండాలని తన శ్రేయోభిలాషులు కోరుతున్నారు తానురాజకీయంలో 20 సంవత్సరాల అనుభవం కలిగిన ఒక గొప్ప రాజకీయ వ్యక్తి. అనికౌడిపల్లి మండలంలోని గ్రామ ప్రజల సమస్యల కోసం. నిరంతరం కృషి చేసి వారికి ఆర్థిక సహాయ సహకారాలు అందించి వారికి అండగా అన్నా ఒక అభ్యున్నత వ్యక్తి యంగ్ అండ్ డైనమిక్ పొలిటికల్ లీడర్ కమింగ్ సూన్ సమస్యలను చూసి పారిపోయేవాడు కాకుండా ఆ సమస్యల నుంచి బయట పడేసి తన హక్కునా చేర్చుకునేవారు కావాలి.. అలాంటి అభ్యున్నత సంస్కారం కలిగిన మన చంద్రం కృష్ణ గౌడ్ కు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరుకుంటూ కౌడిపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం మనమందరం కృషి చేద్దాం తన శ్రేయోభిలాషులు తెలిపారు జాతీయ భూమి ప్రతినిధి చంద్రం కృష్ణ గౌడ్ చరవాణి ద్వారా మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ సర్పంచ్ ఎన్నికల్లో తాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను బరిలో ఉండడానికి ఎటువంటి వెనుకంజ వేలనని మెదక్ జిల్లా గ్రంధాలయ శాఖ అధ్యక్షులు సుహాసిని రెడ్డి నర్సాపూర్ నియోజకవర్గ టిపిసిసి ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అండ దండలతో తాను కౌడిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థిగా తాను బరిలో ఉంటే కౌడిపల్లి గ్రామపంచాయతీ ఓటర్ల దైవ దీవెనలతో తనను సర్పంచ్ అభ్యర్థిగా గెలిపిస్తే కౌడిపల్లి గ్రామపంచాయతీ నీ ఎంతో అభివృద్ధి చేస్తానని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉన్నంతవరకు తాను ప్రజల కోసం ఎన్నో సదుపాయాలను సమకూర్చే విధంగానే ప్రయత్నం చేస్తానని కౌడిపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా కృషి చేయడమే తన కర్తవ్యం గా భావిస్తానని రానున్న స్థానిక సమస్త సర్పంచ్ ఎన్నికలలో అతన్ని గెలిపించుకొని ప్రయత్నం చేయాలని కౌడిపల్లి గ్రామపంచాయతీ ఓటర్లను వేడుకోవడం జరుగుతుందని కౌడిపల్లి మండల కేంద్రంలోని ఎన్నో అభివృద్ధి పనులు గత పరిపాలన టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదని ప్రస్తుతం



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలోనైనా కౌడిపల్లి గ్రామపంచాయతీని అభివృద్ధి చేసే అవకాశాన్ని తనకు కల్పించాలని కౌడిపల్లి ఓటర్ల ను వేడుకోవడం జరుగుతుందని నేటి పరిపాలనలో రాజకీయం చేయడం అష్ట కష్టాలతో కూడుకున్నటువంటి ప్రమేయమేనని ఇలాంటి పరిస్థితుల్లో తాను ఒక అవకాశాన్ని ఇస్తే కౌడిపల్లి గ్రామపంచాయతీ గ్రామాన్ని తన వంతు అభివృద్ధి చేసే దిశలోనే పనిచేస్తానని ఆయన తెలియజేశారు గత ప్రభుత్వ పరిపాలిక పాలన రాజకీయ నాయకుల వలన కౌడిపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి దశలో లేదని తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఇందిరమ్మ పరిపాలన సాగుతుందని నిరుపేదలకు ఇల్లు లేని వారికి ఇండ్లను నిరుద్యోగులకు ఉద్యోగాలను గ్రామంలోని పరిశుద్ధ సౌకర్యాన్ని గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తాను ముందు ఉండి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలియజేశారు

# అనవసరపు ఆరోపణలు చేస్తున్న హరీష్ రావు

- అడ్డగుంటపల్లిలో నీళ్లు అమ్ముకున్న చరిత్ర నీది
- కెసిఆర్ అల్లుడు కావడంతోనే మంత్రి పదవి
- స్వతంత్ర అభ్యర్థి చందర్ ఎందుకు మంత్రి కాలేదు
- కాంగ్రెస్ రామగుండం సీనియర్ నాయకులు దీటి బాలరాజు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 28:** ఏదైతే ప్రభుత్వం పెద్ద పరిశ్రమలు మంజూరు చేస్తుందో అప్పుడే ఒక ప్రెస్ మీట్ పెట్టి అవినీతి జరిగింది అంటూ ఈ అగ్గిపెట్టె హరీష్ రావు చేస్తున్న అసత్యపు ఆరోపణలను ప్రజలు నమ్మకూడదని కాంగ్రెస్ రామగుండం సీనియర్ నాయకులు దీటి బాలరాజు అన్నారు. రామగుండం పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందుగా రామగుండం ప్రాంతానికి వన్ 800 మెగావాట్ల విద్యుత్తు ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మక్కాన్సింగ్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్లో ఎనిమిది వందల మెగావాట్ల పవర్ ప్లాంట్ కు టెండర్లను నిర్వహిస్తామని అందులో తక్కువగా కోర్టు వేసిన వారికి ఈ ప్రాజెక్టు అప్పగించడం జరుగుతుందని స్పష్టంగా తెలియజేసిన విషయం హరీష్ రావుకు అర్థం కాలేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ టెండర్లలో ఎన్టిపిసి సంస్థ, జెన్కో సంస్థలు పాల్గొన్నట్లయితే ఏది తక్కువ కోడ్ చేస్తే ఆ సంస్థకు అప్పజెప్పడం జరుగుతుందని క్లియర్ గా చెప్పడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పవర్ ప్రాజెక్టులు కావాలని కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో 1,00,000 దీపాల కార్యక్రమం చేసిన విషయాన్ని హరీష్ రావు మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా అప్పటి ఎమ్మెల్యే సత్యనారాయణకు ఫోన్ చేసి పవర్ ప్రాజెక్టు ఏర్పాటు సాధ్య అసాధ్యులపై అడగడం జరిగిందని దానికి నిజాయితీగా ఇక్కడ ప్రభుత్వ స్థలాలు లేవంటూ ఆయన సమాధానం ఇచ్చారని బాలరాజ్ గుర్తు చేశారు. బొగ్గు,నీరు దొరికే ప్రాంతంలో థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మించాల్సి ఉండగా అప్పటి సిఎం కెసిఆర్, అప్పటి మంత్రి జగదీష్ రెడ్డికి అక్కడ ఎక్కువ మొత్తంలో భూములు ఉండడంతో ప్రాజెక్టును అక్కడికి బదలాయించడం జరిగిందన్నారు. ఏపీ జెన్కో ద్వారా 3.25 పైసలకు కరెంటు లభించే పరిస్థితి అప్పట్లో ఉండేదన్నారు. అప్పట్లో ఇలాంటి పరిశ్రమలు తేకుండా సొంత ప్రయోజనాలకు పాటుపడిన హరీష్ రావు విమర్శలు చేయడం సరి కాదన్నారు. కేవలం హరీష్ రావు అనే వ్యక్తి కెసిఆర్ కు మేనల్లుడు కావడంతోనే అతనికి మంత్రి పదవి లభించింది అన్నారు. అది కూడా వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మంత్రి పదవి లభించిన విషయం ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమేనన్నారు. గోదావరిఖని పట్టణం పడ్డగుంటపల్లిలో నీళ్లు అమ్ముకున్న చరిత్ర హరీష్ రావు అది కాదా అని ఆయన ప్రశ్నించారు. సుల్తానాబాద్ లో ఒక కళాశాలలో పని చేసిన విషయం హరీష్ రావు మరిచిపోయాడు అని ఆయన గుర్తు చేశారు. మేడిగడ్డ, పార్వతి లక్ష్మి బ్యారేజీలను నిర్మించి ఎంతో అవినీతికి పాల్పడ్డారని కూడా ఆయన గుర్తు చేశారు. 800 మెగావాట్ల ప్రాజెక్టు ఏర్పాటుపై అనవసరపు ఆరోపణలు చేస్తున్న హరీష్ రావుకు తగిన గుణపాఠం ఈ ప్రాంత ప్రజలు చెప్పక తప్పదు అన్నారు. ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగిస్తుందన్నారు. ఏ మాత్రం జ్ఞానం లేని హరీష్ రావు 50 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని చెప్పడం సరికాదన్నారు.

# జ్యోతిరావ్ పూలే జీవితం అందరికీ ఆదర్శమనియం

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 28**



హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం ఆయన 136వ వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ సివిల్ హాస్పిటల్ ముందున్న ప్రధాన చౌరస్తాలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూవిద్య ప్రతి ఒక్కరి సమాన హక్కని మొదటగా నినదించిన మహెూన్నతుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన ఆయన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. పూలే ఆశయాలను అనుసరిస్తూ హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్య చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల విడుదలైన రూ.15 కోట్ల అభివృద్ధి నిధుల్లో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని నాలుగు ప్రధాన జంక్షన్ల అభివృద్ధి కోసం రూ.1 కోటి 30 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. అందులో ఒక సర్కిల్‌కు జ్యోతిరావ్ బా పూలే పేరు పెడతామని తెలిపారు. కార్యక్రమంలో పూలే అభిమానులు, పలు సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం దిష్టిబొమ్మ దహనం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట నవంబర్ 28**

కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై జమ్మికుంట ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

టీపీసీసీ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిని రవి మాట్లాడుతూ, "ఒక ప్రజా ప్రతినిధిగా ఉండి విచక్షణ కోల్పోయి మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ముఖ్యమంత్రిపై అసభ్య పదజాలంతో విమర్శలు చేయడం అంగీకారయోగ్యం



కాదు" అని తీవ్రంగా మండిపడ్డారు.

కౌశిక్ రెడ్డి పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సీఐకు సాయిని రవి ఫిర్యాదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, గూడెపు సారంగపని, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక, శివకుమార్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు గడ్డం దీక్షిత్, మనుపటి సూర్య, రాజేశ్వర్ రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుమ్మరి శ్యామ్, గంగరపు మహేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పంజల అజయ్ గౌడ్, సీనియర్ నాయకులు ఆడెపు కిరణ్, కుతడి తిరుపతి, సుమన్, విన్ను తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గా సాన కిషన్

**జకరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 28**



రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు సదానందం గౌడ్, జుట్టు గజేందర్ సంయుక్తంగా కరీంనగర్‌కు చెందిన సాన కిషన్ ను రాష్ట్ర సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సంఘ కార్యకలాపాల పటిష్టీకరణలో ఆయన అనుభవం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పిన్నింటి తిరుపతి రావు, కోట శ్యామ్‌కుమార్, సీనియర్ నాయకులు, సాన కిషన్ నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన సేవలు మరింత దోహదం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 28:** గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్ మెడ్ కవర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐజేయూ అనుబంధ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎం.వంశీ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పూదరి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, పలువురు సీనియర్ జర్నలిస్టులతో కలిసి వంశీ, పూదరి కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆధునిక






సమాజంలో అనేక రకాల వ్యాధులు మానవ జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులతో అకాల మరణం పొందుతున్న వారి సంఖ్య అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ఒత్తిళ్ల మధ్య వృత్తిని కొనసాగించే జర్నలిస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. క్లబ్ విజ్ఞప్తి మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

అనంతరం, శిబిరానికి హాజరైన సుమారు 150 మంది జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

వివిధ విభాగాలకు చెందిన మెడికవర్ హాస్పిటల్ వైద్యులు టెస్ట్ రిపోర్టులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రెస్ క్లబ్ ప్రధానకార్యదర్శి పందిళ్ళ శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి గడ్డం శ్యాం కుమార్, సీనియర్ జర్నలిస్టులు అల్లంకి లచ్చయ్య, కోల లక్ష్మణ్, దయానంద్ గాంధీ, చంద్రశేఖర్, పాలకుర్తి విజయ్ కుమార్, మ్యాజిక్ రాజా, కేఎస్ వాసు, బొల్లం మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు బైరం సతీష్, మామిడి సత్యనారాయణ, రాజ్ కుమార్, జియో శ్రీనివాస్, సురభి శ్రీధర్, శంకర్, ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాలువ మరమ్మతులు చేపట్టండి

**కరపత్రం ప్రతినిధి మంథని, నవంబర్ 28 :**



కన్నాల ప్రాజెక్టు కింద బన్నచెరువు, శిలసముద్రం, అయ్యగారి చెరువు అయ్యగారి చెరువులకు నీరు వచ్చే కాలువ మరమ్మతులను వెంటనే చేపట్టాలని రైతులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మంథని మండలం మల్లేపల్లి, కన్నాల నుండి మంథని వరకు సుమారు 1800 ఎకరాల వరి పంట సాగు అవుతుందని, గత రెండు సంవత్సరాల నుండి కన్నాల ప్రాజెక్టు కాలువ పూడిక తీయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ మరమ్మతులతో పాటు రైతులకు రహదారి సౌకర్యం కల్పించాలని రైతుల కోరుతున్నారు. పంటకు మందు బస్తాలు ఎరువులు తీసుకెళ్లడానికి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతుల పిల్లి సత్తయ్య, ఐలి నరసయ్య, నరేడ్ల బుచ్చన్న, ఉప్పల శ్రీనివాస్, కొమిరెడ్డి శ్రీనివాస్, కొత్త వెంకన్న, మేదరి వెంకన్న, గాజుల బానయ్య, మిట్ట బాలయ్య, కామ నరసయ్య, చంద్రయ్య, ఉప్పల రామయ్య, కొత్త బాలయ్య, తాటి తిరుపతి, కిష్టయ్య, బిరుదు మల్లయ్య, శ్రీనివాసులు కోరారు.

# బీ.సీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి
- రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 28:** బీ.సీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్దానిక సంస్దల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీ.సీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ సభలో బీసీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ తీర్మానాలతోనూ బిసీ రిజర్వేషన్ సాధ్యం కాదని రేవంత్ సర్కార్ కు తెలసని ప్రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతది అనేది వాస్తవం ఇది అక్షర సత్యం అన్నారు. బిజెపికి కాంగ్రెస్ పార్టీ రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చేప్పాలన్నారు. గ్రామ పంచాయతీ



ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పనిచేయాలని మోసపూరిత కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలంతా బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేక పోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం మీ వద్దకు వస్తే ఫెన్షన్ 4 వేలు, కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళా విద్యార్థినులకు స్కూటీలు,రైతు బంధు, రైతు బీమా ఏదని నిలదీయాలని సూచించారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల తిరస్కరణ తథ్యమని, బీఆర్ఎస్ విజయడంఖ మ్రోగించనుందని వెల్లడించారు. రామగుండం నియోజకవర్గంలో ఉన్న 27 గ్రామపంచాయిలకు బీఆర్ఎస్ పార్టీ నుండి ప్రతి గ్రామానికి ఇంచార్జీలను, కో ఆర్డినేటర్ లను ప్రకటించుకోవడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కలసి కట్టుగా పనిచేయాలని కోరారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహనీయుల స్ఫూర్తిని నేటి తరానికి తెలియపరుస్తూ, వారి ఆశయాల కృషికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, గోపు అయిలయ్య యాదవ్, బోడ్డు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణ వేణీ, గాధం విజయ, బాదె అంజలి, పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి, మేడి సదానందం, కాల్వ శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, నూతి తిరుపతి, బుర్ర శంకర్, పిల్లి రమేష్, సట్టు శ్రీనివాస్, బస్వరాజ్ గంగరాజు, తోకల రమేష్, గుర్రం పద్మ, ఇరుగురాళ్ల శ్రావన్, కోడి రామకృష్ణ, కీరన్ జీ చింటూ, ఆవునూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

**కరపత్రం ప్రతినిధి మంథని, నవంబర్ 28:** మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలో భూమిని అక్రమంగా సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు రామిడి పద్మ పేర్కొన్నారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వెంకటాపూర్ గ్రామస్తులు శనిగల శ్రీనివాస్, పాలమాకుల నరసింహారెడ్డి, బండారి సంపత్, తిరుపతిరెడ్డి లు అక్రమంగా




తమ వ్యవసాయ భూమిని సాగు చేస్తూ తనపై హత్యాయత్నం చేశారని ఆమె ఆరోపించారు ఈ విషయంపై గతంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని మళ్లీ ఈరోజు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని. కోర్టులో సైతం ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడంలేదని ఆమె ఆరాపించారు. భూమిని ఆక్రమించుకున్న అక్రమ మార్కులకు పోలీసులు సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. నా పొలంలో అక్రమంగా ప్రవేశించి వరి పంటను హార్వెస్టింగ్ మిషన్ తో ధ్వంసం చేశారని సంపత్ నరసింహారెడ్డి ల సహకారంతో పండిన ధాన్యాన్ని కోయించి ఎత్తుకెళ్లారని ఆమె ఆరోపించారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.